50 రోజులు ఎమ్మెల్యే నేనే..!

- ఎన్నికల్లో పోటీలో ఉంటా : ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: ఎన్నికల్లో పోటీలో ఉంటానని ఎమ్మెల్యే రేఖా నాయక్ స్పష్టం చేశారు. సోమవారం ఆమె నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 50 రోజులు ఎమ్మెల్యే తానేనని స్పష్టం చేశారు. తన పదవీకాలం మొత్తం సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందే విధంగా చూస్తానని తెలిపారు. కార్యకర్తలు, అభిమానుల కోరిక మేరకు ఎమ్మెల్యేగా బరిలో ఉంటున్నానని పేర్కొన్నారు. త్వరలోనే ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి కార్యకర్తలతో చర్చించి ఏ పార్టీ నుండి నిలబడతానో తెలియజేస్తానని తెలిపారు. నిలిచేది గెలిచేది తామే అని స్పష్టం చేశారు.



www.navatelangana.com

నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

మంగళవారం 22 ఆగస్టు 2023

1

డీటీఎఫ్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో సోమవారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ ప్రకటించడంతో పాటు జీఓ నెం.317ను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ దుర్గం విస్తారు, కో కన్వీనర్లు ఎం ధర్మయ్య, నాందేవు పాల్గొన్నారు.



ముగ్గురు ఔట్..!

- బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ స్థానాల్లో మార్పులు
- అనిల్‌జాదవ్, జాన్సన్‌నాయక్, కోవ లక్ష్మికి కేటాయింపు
- వీరితో పాటు ఏడుగురు సిట్టింగ్‌లకు టిక్కెట్లు ఖరారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా విడుదల
- టికెట్లు వచ్చిన అభ్యర్థుల అనుచరుల సంబరాలు
- నిరాశలో రేఖానాయక్, బాపురావు..ఎంపీ బరిలో ఆత్రం సక్కు..!

బీఆర్ఎస్ జాబితా ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా వెల్లడైంది. పది సిట్టింగ్ స్థానాల్లో ముగ్గురు ఎమ్మెల్యేలకు పార్టీ అధిష్టానం మొండి చేయి చూపించింది. ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు రేఖానాయక్, రాథోడ్ బాపురావులకు పార్టీ టికెట్ నిరాకరించింది. వీరి స్థానంలో ఖానాపూర్ నుంచి ఎన్ఆర్ఐ జాన్సన్‌నాయక్‌కు..బోథ్ నుంచి నేరడిగొండ జడ్పీటీసీ అనిల్‌జాదవ్‌కు అవకాశం కల్పించడం చర్చనీయాంశంగా మారింది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే స్థానంలో జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మికి టికెట్ కేటాయించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కును ఎంపీ బరిలో నిలిపేందుకు పార్టీ అధిష్టానం హామీనిచ్చినట్లు తెలిసింది. మరోపక్క మిగితా ఏడు స్థానాల్లోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మళ్లీ అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాలకు సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను ఆ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. టికెట్లు దక్కిన వారిలో ఆనందం వ్యక్తం కాగా.. చోటు లభించని వారు నిరాశకు గురవుతున్నారు. టికెట్లు పొందిన అభ్యర్థుల అనుచరవర్గం సంబరాలు జరుపుకోగా..రాని వారిలో నిరాశ వ్యక్తమవుతోంది.



ఆదిలాబాద్‌లో జోగు రామన్నతో కలిసి నాయకులు, కార్యకర్తల సంబరాలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తలపడేందుకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత ముందుగానే ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది స్థానాల్లో అందరూ ఈ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2018లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆసిఫాబాద్ మినహా తొమ్మిది స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ ఆ ఒక్క స్థానంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఆత్రం సక్కును బీఆర్ఎస్‌లో చేర్చుకుంది. దీంతో ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేలందరూ అధికార పార్టీకి చెందిన వారే ఉన్నారు. తాజాగా పది మందిలో ముగ్గురికి రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ టికెట్ నిరాకరించారు. ఖానాపూర్ నుంచి బీఆర్ఎస్ తరపున రెండు సార్లు గెలిచిన రేఖానాయక్ ఈ దఫా పార్టీ టికెట్ నిరాకరించింది. ఈ స్థానంలో మంత్రి కేటీఆర్‌కు సన్నిహితుడు, ఎన్ఆర్ఐ భూక్యా జాన్సన్‌నాయక్‌కు పార్టీ టికెట్ కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రి కేటీఆర్‌కు జాన్సన్ నాయక్ సన్నిహితుడు కావడంతో టికెట్ భరోసా కారణంగానే ఈయన గత ఆరు నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఒకరోజు ముందుగానే పార్టీ అధిష్టానం రేఖానాయక్‌ను హైదరాబాదుకు పిలిపించి టికెట్ ఇవ్వడం లేదనే విషయమై మాట్లాడినట్లు తెలిసింది. బోథ్ స్థానంలోనూ సిట్టింగ్ స్థానం మారడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ పదేండ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్న రాథోడ్ బాపురావును కాదని.. నేరడిగొండ జడ్పీటీసీగా పనిచేస్తున్న అనిల్‌జాదవ్‌కు గులాబీ టికెట్ కేటాయించింది. ఇది వరకు ఒకసారి కాంగ్రెస్ తరుపున, మరోసారి స్వతంత్రంగా పోటీ చేసిన అనుభవం ఉండటంతో పార్టీ టికెట్ ఇచ్చినట్లు తెలిసింది. మరోపక్క రేఖానాయక్, రాథోడ్ బాపురావులకు నియోజకవర్గాల్లో వ్యతిరేక పవనాలు వీయడం.. పార్టీలోనూ అసమ్మతి గళాలు అధికంగా ఉండటంతో పార్టీ అధిష్టానం వీటిని సైతం పరిగణనలోకి తీసుకొని పార్టీ టికెట్ నిరాకరించిందనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క ఆసిఫాబాద్ స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని.. జిల్లాలో జడ్పీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న కోవ లక్ష్మికి టికెట్ కేటాయించారు. మరోపక్క ఇక్కడి ఎమ్మెల్యే ఆత్రం సక్కును ఆదిలాబాద్ పార్లమెంటు బరిలో నిలుపాలని పార్టీ అధిష్టానం భావిస్తోంది. ఈ విషయం ఆత్రం సక్కుకు కూడా చెప్పి ఎంపీ టికెట్‌పై భరోసా ఇచ్చినట్లు తెలిసింది. పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

ఏడుగురు సిట్టింగ్‌లకు టికెట్లు

ఉమ్మడి జిల్లా పది నియోజకవర్గాల్లో ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆదిలాబాద్ నుంచి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జోగు రామన్నకు మరోసారి టికెట్ వరించింది. నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సిర్పూర్‌లో కోనేరు కోనప్ప, చెన్నూర్‌లో ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌లకు పార్టీలో పార్టీలో అసమ్మతి పెద్దగా లేకపోవడంతో టికెట్ కేటాయింపులో అధిష్టానానికి అంతగా సమస్య ఎదురుకాలేదని తెలుస్తోంది. మంచిర్యాల స్థానం పలువురు టికెట్ ఆశించినప్పటికీ.. పార్టీ అధిష్టానం వారిని పరిగణనలోకి తీసుకోలేదు. సీనియర్ అయిన ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే దివాకర్‌రావుకే టికెట్ కేటాయించింది. బెల్లంపల్లి టికెట్ విషయంలోనూ కొంత ఊగిసలాట ఉన్నట్లు తొలుత ప్రచారం జరిగింది. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను కాదని.. గ్రంథాలయ ఛైర్మెన్ రేణిగుంట్ల ప్రవీణ్‌కు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. కానీ పార్టీ అధిష్టానం మాత్రం మరోసారి దుర్గం చిన్నయ్యకే పార్టీ టికెట్ కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక ముధోల్ నియోజకవర్గంలో రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలుపొందిన విఠల్‌రెడ్డికి టికెట్ ఇవ్వకూడదని పార్టీలో అసమ్మతి నాయకులు గళమెత్తారు. కానీ పార్టీ అధిష్టానం మాత్రం వాటిని పట్టించుకోలేదు. మరోసారి విఠల్‌రెడ్డికే టికెట్ ఖరారు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ టికెట్లు దక్కిన ఎమ్మెల్యే అభ్యర్థుల అనుచరులు టపాకాయలు పేల్చి సంబరాలు నిర్వహించారు. దక్కని వారి అనుచరులు నిరాశకు గురవుతున్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థులు వీరే..

మంత్రి ఐకేరెడ్డి భూదందా కోసమే మాస్టర్ ప్లాన్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వేల కోట్ల భూదందా కోసమే ఈ మాస్టర్ ప్లాన్ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి అన్నారు. నిర్మల్ మాస్టర్ ప్లాన్ రద్దుకు బీజేపి నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష సోమవారం 6వ రోజుకు చేరుకుంది. మహేశ్వర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గత అర్ధరాత్రి 2గంటల సమయంలో పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో తిరిగి మహేశ్వరరెడ్డి తన నివాసంలో దీక్ష ప్రారంభించారు. కిషన్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డికి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దుర్మార్గ పాలన తెలంగాణ వ్యాప్తంగా తెలిసిందన్నారు. మంత్రికి వ్యతిరేకంగా పోరాడిన ఇక్కడి బిజెపి శ్రేణులు తెలంగాణకు ఆదర్శమన్నారు. మంత్రి తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట భూ కబ్జాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల భూములతో వ్యాపారం చేయడానికే 220 జీవో తీసుకొచ్చారని తెలిపారు. ఎక్కడ చూసినా ధరణి పేరుతో ప్రభుత్వం పేద రైతుల భూములను లాక్కుతుందన్నారు. బడా వ్యాపారుల కోసమే కేసిఆర్ ప్రభుత్వ భూములను వేలం వేస్తున్నారని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబం రియల్ ఎస్టేట్‌లకు బ్రోకర్లుగా వ్యవహరిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్ నిధులు ఏమయ్యాయో తెలపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇలా అన్ని మోసపూరిత హామీలు ఇచ్చిన కెసిఆర్‌కు వచ్చే ఎన్నికలలో ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. ఈ నెల 27న ఖమ్మంలో రైతు భరోసా బిజెపి బహిరంగ సభ ఉంటుందని, ముఖ్య అతిథిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, జేపీ నడ్డా హాజరు కానున్నారని తెలిపారు. పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి ప్రజలు తరలి రావాలని కోరారు. అనంతరం లాఠీచార్జిలో గాయాల పాలైన కార్యకర్తలను ఆసుపత్రిలో పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు రావుల రాంనాథ్, అయ్యన్న గారి భూమయ్య, రమాదేవి, అల్జాపూర్ శ్రీనివాస్, రాథోడ్ రమేష్, చిట్యాల సుహాసినిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, పల్లె గంగారెడ్డి, సామ రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మ రాజు, నాయుడి మురళి, వొడిసెల అర్జున్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీలపై అవగాహన



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటి యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సైబర్ క్రైమ్ సైబర్ సెక్యూరిటీలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్జీయూకేటీ వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ ఆదేశాల మేరకు హైదరాబాద్, సైబరాబాద్‌లలో పనిచేస్తున్న నిపుణులు డాక్టర్ శ్రీరామ్ బిరుదవోలు, సైబర్ సెక్యూరిటీ మేనేజర్ భానుమూర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సైబర్ క్రైమ్‌లకు అడ్డుకట్ట వేసే, సైబర్ సెక్యూరిటీ అందించే సంస్థలలో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు టెక్నాలజీ పరంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. నేటి సమాజంలో డేటా భద్రత, నెట్వర్క్ భద్రత, అప్లికేషన్ భద్రతా తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్గి ఉండాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు కంప్యూటర్ సిస్టంలపై ఉగ్రవాదులు లేదా క్రైమ్ చేసే ఒక సమూహాము ఎల్లప్పుడూ ఉంటుందని, అలాంటి దాడుల నుండి సిస్టంలను భద్రపరచడానికి ఒక సాంకేతిక విజ్ఞానం, విధానం విద్యార్థులుగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. ప్రపంచంలో నిరంతరం కొత్త టెక్నాలజీలను అభివృద్ధి పరుస్తూ ఆ టెక్నాలజీని ఉపయోగించి సైబర్ నేరగాళ్లు సైబర్ క్రైమ్‌తో పాటు సైబర్ సెక్యూరిటీ నిబంధనలను తొలగించి లక్షిత దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఆరిఫ్ అలీ, పిఆర్ఓ డాక్టర్ విజయ్ కుమార్, ఆర్జీయూకేటీ సెక్యూరిటీ ఆఫీసర్ రాకేష్, పవన్ విద్యార్థులు పాల్గొన్నారు.

భాషలో మౌలిక సామర్థ్యాలు పెంచడమే 'ఉన్నతి' లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భాషలో మౌలిక సామర్థ్యాలైన రాయడం చదవడం విషయాల వారిగా అభ్యసన ఫలితాలను సాధించడమే ఉన్నతి అభ్యసన అభివృద్ధి మౌలిక లక్ష్యమని జిల్లా ఇన్చార్జి విద్యాధికారి ఉదయబాబు తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అన్ని రకాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహించే ఉన్నతి కార్యక్రమం శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో భాష మౌలిక సామర్థ్యాలు పెంచడమే ఉన్నతి లక్ష్యమన్నారు. పాఠానికి అవసరమైన పూర్వ భావనలు అంశాలను అవగాహన కలిగించి ఆయా సబ్జెక్టులకు సంబంధించిన అభ్యసన ఫలితాలను సాధించాలన్నరు. 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఈ ఉన్నతి అభ్యసనాభివృద్ధి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, పాఠశాలలోని అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు పీరియడ్ వారిగా, పాఠ్యాంశాల వారీగా ఏ విధంగా బోధన చేయాలో, ఏ విధంగా విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించాలో తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులే ఉన్నత పాఠశాలకు నిజమైన లీడర్స్ అని, ఉన్నత పాఠశాలలో మానిటరింగ్ పకడ్బందీగా నిర్వహించి ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించి కనీస అభ్యసన సామర్థ్యాల సాధనకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, మండల రిసోర్స్ పర్సన్‌లు సుభాష్, వెంకటేశ్వర స్వామి, అనురాధ పాల్గొన్నారు.

సీట్ల కేటాయింపులో బీఆర్ఎస్ బీసీలకు మొండిచేయి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీర్ఎస్ అసెంబ్లీ సీట్ల కేటాయింపులో బీసీలకు మొండిచేయి చూపించిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్నర్ రమేష్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 60 శాతం ఉన్న బీసీలను పక్కకి పెట్టి 10శాతం ఉన్న రెడ్డి, రావులకు 50శాతం సీట్లు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రస్తుతం భారతీయ రెడ్డి రావుల సమితిగా మారిందన్నారు. మొదటి జాబితా రద్దుచేసి బీసీలకు సరైన ప్రాధాన్య కల్పిస్తూ మరో జాబితా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బీసీలందరినీ ఏకం చేసి చిత్తుచిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోషే శంకర్ పటేల్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్‌కుమార్, బీసీ యువజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మారుతి, తేజపూర్ సర్పంచ్ సోమేశ్వర్, జిల్లా పటేల్ అధ్యక్షులు నారాయణ, నాయకులు నాగోరావు, గౌరయ్య, మొండి పాల్గొన్నారు.

అధినాయకుని మన్ననలతో...

- రెండో సారి అధికార పార్టీ టిక్కెట్ దక్కించుకున్న కోనప్ప
- కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీఆర్ఎస్ అధినాయకుడు, సీఎం కేసీఆర్ మన్ననలనందుకుంటున్న సిర్పూరు(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వరుసగా రెండోసారి కూడా టిక్కెట్ దక్కించుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికలలో మొదటి సారిగా బీఆర్ఎస్ (అప్పట్లో టీఆర్ఎస్) టిక్కెట్‌పై పోటీ చేసిన కోనేరు కోనప్ప, ప్రస్తుతం రెండో సారి అదే పార్టీ నుండి టిక్కెట్ దక్కించుకున్నారు. ఈ నియోజకవర్గం నుండి కోనేరు కోనప్పకే టిక్కెట్ దక్కుతుందని ముందునుండే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంచనా వేస్తూ వస్తున్నారు. అనుకున్నట్లుగా సీఎం కేసీఆర్ సోమవారం విడుదల చేసిన మొదటి జాబితాలోనే ఆయన పేరు ఉండడంతో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సంబరాలలో మునిగిపోయారు.



కోనప్ప సతీమణికి స్వీటు తినిపిస్తున్న పార్టీ శ్రేణులు

2014లో టీఆర్ఎస్‌లో చేరిక

1985 నుండి రాజకీయాలలో కొనసాగుతున్న కోనేరు కోనప్ప ప్రారంభంలో ఎన్టీఆర్ అభిమానిగా టీడీపీలో పని చేశారు. అప్పటి చీఫ్‌విప్ కేవీ నారాయణరావుకు నమ్మకమైన వ్యక్తిగా పార్టీలో చురుకుగా పని చేశారు. తర్వాత ఆయనతో విభేధాలు రావడంతో కాంగ్రెస్‌లో చేరారు. 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా మొదటి సారిగా అసెంబ్లీ ఎన్నికలలో ఈ నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓటమి చెందారు. తర్వాత 2004లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో టీఆర్ఎస్ అభ్యర్థి కావేటి సమ్మయ్యపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మృతి అనంతరం ఆయన కాంగ్రెస్‌ను వీడారు. 2014లో బహుజనసమాజ్ పార్టీ నుండి పోటీ చేసి రెండో సారి విజయం సాధించారు. అనంతరం ఆయన కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్)లో చేరారు. అప్పటి నుండి ఆయన పార్టీలో చురుకుగా పని చేస్తూ అధినాయకత్వం మెప్పును పొందారు. ముఖ్యంగా కేటీఆర్ దగ్గర నమ్మకాన్ని సాధించుకున్నారు. కాగజ్‌నగర్‌లో మూతపడ్డ సిర్పూరు పేపర్ మిల్లు పున:ప్రారంభం కోసం కోనప్ప తరచుగా కేటీఆర్‌ను కలవడం, సీఎం కేసీఆర్ దృష్టికి సమస్య తీసుకుపోవడం చేశారు. దీంతో కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని మిల్లు పున:ప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే కృషిని కేటీఆర్ అసెంబ్లీలో కూడా ప్రస్తావించి అభినందించారు. జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలను కూడా కోనప్పకే అప్పగించారు. అధిష్టానంతో సన్నిహితంగా ఉన్న కోనేరు కోనప్ప మొదటిసారి 2018లో టిక్కెట్ దక్కించుకోగా, ప్రస్తుతం 2023లో రెండో సారి టిక్కెట్ దక్కించుకున్నారు.

పార్టీ శ్రేణుల సంబరాలు

సిర్పూరు బీఆర్ఎస్ టిక్కెట్ కోనేరు కోనప్పకు దక్కడంతో పార్టీ శ్రేణులు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక రాజీవ్‌చౌక్‌లో టపాసులు పేల్చారు. స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. నృత్యాలు చేశారు. కేసీఆర్, కోనప్పల నాయకత్వాలు వర్థిల్లాలంటూ నినాదాలు చేశారు.

కౌటాల : బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే కోనేరు కోనప్పను ప్రకటించడంతో మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు టకాపాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్‌రావు, బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మెర్వెల్లి బ్రహ్మయ్య, సర్పంచ్ మోర్లె రమేష్, నాయకులు శ్రీనివాస్, బాపు, సంతోష్ పాల్గొన్నారు.

దహెగాం : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి కోనేరు కోనప్ప పేరు ఖరారు చేయడంతో సోమవారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ శ్రీరామారావు ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, నాయకులు పుప్పాల సంతోష్, ప్రసాద్‌రాజు, ఎలుములె జయేందర్, జర్పుల కృష్ణమూర్తి, పాపయ్య పాల్గొన్నారు.



కౌటాల :



దహెగాం :

తెలియని వైద్యం చేయొద్దు



నవతెలంగాణ - సిర్పూర్(టి)

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు తెలిసిన వైద్యమే చేయాలని, తెలియకపోతే పెద్దాస్పత్రులకు పంపించాలని ఎస్ఐ దీకొండ రమేష్ అన్నారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు తులసీదాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో వైద్యసేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికీ ప్రజలు మూఢనమ్మకాలతో ఉన్నారన్నారు. ప్రత్యేకంగా వారికి ఆరోగ్యం పట్ల, వైద్యం పట్ల అవగాహన కల్పించి వైద్యమందించాలని తెలిపారు. వచ్చిన వైద్యం మాత్రమే చేస్తూ ఆరోగ్య పరిస్థితి విషమిస్తే పెద్దాసుపత్రులకు పంపించాలన్నారు. ఎలాంటి ప్రాణాపాయం కలగకుండా ముందు జాగ్రత్తగా ఉండాలని, ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులను పరిశీలించి, గుర్తించి మెరుగైన వైద్యమందించాలని తెలిపారు. ప్రజలు దేవుని కంటే వైద్యులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని, వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని అధిక డబ్బులు వసూలు చేయొద్దని పేర్కొన్నారు. రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి తనకు సమాచారం అందిస్తే రక్తం ఇప్పించడంలో ముందుంటానని, సాధ్యమైనంత వరకు గర్భిణులకు వైద్యం చేయొద్దని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అమృత్ సర్కార్, ఉపాధ్యక్షుడు బుక్య వినోద్, కోశాధికారి ఆదె లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు అబ్రహార్, జావీద్ హైమద్, అజ్జు, మహేష్, రఘునాథ్, పరమేశ్వర్, శంకర్, హేమాజీ, రతన్ పాల్గొన్నారు.

బంజారా తీజ్ సీడీ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఉట్నూర్

దేశంలోని లంబాడ బంజారాల తీజ్ సంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి రచించిన బంజారా తీజ్ సాంప్రదాయ పాటలను ప్రెస్‌భవన్‌లో సోమవారం ఆవిష్కరించారు. బంజారా రచయితల వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బంజారా తీజ్ ఫ్లెక్సీని ఎంపీటీసీ జాదవ్ గోపాలరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గేయ రచయితలు ఇందల్ సింగ్ రాథోడ్, నందిని, ఉట్నూర్ సాహితీ వేదిక ఉపాధ్యక్షుడు బంకట్‌లాల్ మాట్లాడుతూ బంజారా సంస్కృతి సాంప్రదాయాల రక్షణకు తాము పాటుపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంప్రదాయ పరంగా పాటలను రచించి ఆవిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు రవీందర్, నరహరి, ధరంసింగ్, సేవాసింగ్, శ్రావణ్ రాథోడ్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

బీర్నందిలో కాపర్ వైర్ చోరీ

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని బీర్నంది గ్రామంలో పొలంలో ఉన్న విద్యుత్ నియంత్రకను ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఏఈ తిరుపతి తెలిపారు. ఆదివారం రాత్రి ఈ సంఘటన జరిగిందని గ్రామస్తులు తెలపడంతో సోమవారం దొంగతనం జరిగిన స్థలానికి ఏఈ పరిశీలించారు. గుర్తు తెలియని వక్తులు 63 కేవి సామర్థ్యం గల వ్యవసాయ విద్యుత్తు నియంత్రికను ధ్వంసం చేసి కాపర్ వైరు చుట్టలను దొంగిలించారని తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
మంగళవారం 22 ఆగస్టు 2023

సాధారణ కాన్పుపై అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

సాధారణ కాన్పులపై గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించాలని, డీప్యూటీ డీఎంహెచ్ఓ సాధన వైద్యులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకే రోజు ఏడుగురు పండంటి మగ, ఆడ బిడ్డలకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా డీప్యూటీ డీఎంహెచ్ఓ సాధన, ఎంసీహెచ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విజయ సారథి పరిశీలించారు. ఈ సందర్భంగా ఒకే రోజు ఏడుగురికి సాధారణ ప్రసవం కావడం, అందరూ ఆరోగ్యంగా ఉండటం పట్ల మెడికల్ ఆఫీసర్స్, స్టాఫ్ నర్స్, పీహెచ్‌సీ సిబ్బందిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సాగర్, ఎంఓ కిరణ్, హెల్త్ అసిస్టెంట్ కైలాష్, సీహెచ్ఓ శ్వేతా, వైద్య సిబ్బంది పద్మా, పార్వతి పాల్గొన్నారు.



శంకర్‌గూడలో వైద్యశిబిరం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని శంకర్‌గూడలో సోమవారం ఇంద్రవెల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సోమవారం నవతెలంగాణలో మంచం పట్టిన శంకర్‌గూడ అనే వార్త ప్రచురితం కావడంతో వైద్యాధికారులు స్పందించారు. జ్వరబాధితులను పరీక్షించి మందులను అందజేశారు. ప్రస్తుత వర్షాకాలంలో దోమలు విజృంభించి జ్వరాలు సోకే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటివద్ద ఉపయోగించే ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని అన్నారు. ఈ వైద్యశిబిరంలో హెచ్ఎస్ శ్రీనివాస్, హెచ్ఏ వినోద్, ఏఎన్ఎంలు తిరుపతమ్మ, వందన, దేవిదాస్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



నవతెలంగాణ-నిర్మల్

విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం డీఆర్వో లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత విద్యారంగంపై ప్రతి సంవత్సరం నిధులు తక్కువ కేటాయిస్తూ వస్తుందోని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ విడుదల చేయాలని అన్నారు. బడుగు, బలహీన, పేద విద్యార్థుల కోసం పీజీ కళాశాలను ప్రారంభించాలని అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి పీజీ కళాశాలను మూసివేశారని, దీనివలన విద్యార్థులపై చదువులు చదవడానికి వెళ్లలేక మధ్యలోనే చదువు ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఓట్లు వేసి గెలిపించినందుకు ఇక్కడున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పీజీ కళాశాల మూసివేస్తారని ప్రశ్నించారు. బడుగు, బలహీన, పేద విద్యార్థులు మంత్రికి చదువుకోవడం ఇష్టం లేదా అని ప్రశ్నించారు. పీజీ కళాశాలను తిరిగి అన్ని వసతులతో అన్ని కోర్సులతో ప్రారంభించకపోతే ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఎదురుగా ధర్నాకు పిలుపునిస్తామని అన్నారు. ఎస్ఎఫ్ఐ నిర్వహించిన సమరభేరి జీపు జాతలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చినాయని అన్నారు. గతంలో బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలు పరిష్కారిస్తామన్న మంత్రి కేటీఆర్ నేటి వరకు ఒక్క డిమాండ్ కూడా పరిష్కరించలేదని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేటి వరకు జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పుస్తకాలు అందలేదన్నారు. ఖాళీగా ఉన్న టీచర్లను భర్తీ చేయలేదని అన్నారు. వెంటనే ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేటి వరకు ఎక్కడ కూడా ప్రారంభించలేదని అన్నారు. చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి బస్సు పాస్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన పేద విద్యార్థులకు చదువుకుంటున్న సంక్షేమ హాస్టళ్లకు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని పేర్కొన్నారు. అలాగే జూనియర్ కళాశాలలో పాఠశాలలో స్కావెంజర్స్ లేక పాఠశాలకు జూనియర్ కళాశాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల ప్రారంభించాలని అన్నారు. అలాగే ముధోల్ నియోజకవర్గ కేంద్రంలో బాలుర, బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలన్నారు. మన ఊరు, మన బడి కింద మంజూరైన పాఠశాలలో సరేనా పనులు చేయడం లేదన్నారు. భైంసా మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ హై స్కూల్‌కు గత ఏడాది డిసెంబర్‌లో మంజూరైన నిధులు నేటి వరకు అక్కడున్న పాఠశాలలో ఏ ఒక్క పని కూడా చేయలేదని తెలిపారు. వెంటనే విద్యార్థుల సమస్యల పరిష్కరించకపోతే ఎమ్మెల్యేల కార్యాలయం ఎదురుగా ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నవీన్, జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు ప్రతాప్, ఉదయ్, చరణ్ వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల రాస్తారోకో

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను యథావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనిటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె సోమవారంతో 7వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సమ్మె శిబిరం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీగా తరలివెళ్లి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్ఏ(ఎఫ్) పోస్టుల భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని అన్నారు. 1520 పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించి, సెలక్ట్ చేయబోతోందన్నారు. దీంతో కాంట్రాక్టు ఉద్యోగులు కూడా పరీక్ష రాయాల్సి వస్తోందని, మెరిట్ వస్తేనే సెలక్ట్ అయ్యే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. సర్వీసుకు 20 మార్కులు వెయిటేజీ ఇచ్చినా ప్రయోజనం ఉండదన్నారు. గత 20 సంవత్సరాలుగా వీరంతా పనిచేస్తున్నారని, గతంలో డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపికై విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. మళ్లీ వీరిని పరీక్ష రాయమనడం న్యాయం కాదన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-నార్నూర్



డీసీసీ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో ఎంపీటీసీ అబేదా ఖానం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం చేశారు. ప్రారంభానికి ముఖ్యతిథిగా ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొక్కిరాల విశ్వప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు న్యాయం చేసే పార్టీ పేదల పార్టీ అని కొనియాడారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీటీసీ అబేదా ఖానమ్ కాంగ్రెస్ పార్టీకి కలిసికట్టుగా పనిచేయడం హర్షణీయన్నారు. పార్టీ కోసం అందరూ కలిసి కట్టుగా పని చేయాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యకర్తలు శివాజీ పటేల్, రాథోడ్ యశ్వంత్‌రావ్, జాదవ్ తానాజీ, ఆడే బాబులాల్, కైలాష్, కరీమ్ ఖాన్, ప్రేమ్‌సింగ్, దిగంబర్, ఆడే, నానాజీ పటేల్, భీంరావ్ పటేల్, గోవింద్‌రావ్, జైవంత్ రాథోడ్, ఎస్‌డీ నిజామ్, జాకిరుల్లాఖాన్, బానోత్ విలాస్ నాయక్, దేవురావ్ లోఖండే, యూసుఫ్ ఖాన్, మాణిక్‌రావు ఆడే, శ్యామ్ సుందర్, దేవిదాస్, కార్తీక్ రాథోడ్ ఉన్నారు.

ఉట్నూరులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజనులు ఉన్నత విద్యలో రాణించేందుకు ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని మాజీ పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జాదవ్ రామ్‌కిషన్ నాయక్ అన్నారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉట్నూరులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చినప్పటికి ఇప్పటికి అమలు చేయలేదని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూరులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాలు విద్య, వైద్య రంగాలలో పూర్తిగా వెనుకబడి ఉన్నాయని అన్నారు. ఉట్నూర్ కేంద్రంగా ఉన్న ఆస్పత్రిని వంద పడకల ఆసుపత్రిగా ఆధునికరించాలని, ఖానాపూర్ మండలంలో సదర్‌మాట్ ప్రాజెక్టు నిర్మాణాన్ని రీడ్ డిజైన్ చేసి, ఆయ కట్టు ప్రాంతాలకు సాగునీరు అందించాలన్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన కడం ప్రాజెక్టులో పూడుక నిండిపోవడంతో నీరు వృధా అవుతుందని అన్నారు. కడెం ప్రాజెక్టులో పూడిక తీయించి మరో నాలుగు గేట్లు నిర్మించాలన్నారు. పదవీ విరమణ చేసి మూడేండ్లు గడుస్తున్నందున రాజకీయల్లోకి రాబోతున్నట్లు, ఈనెల 23న హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్, శ్రీహరిరావుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జాదవ్ గోపాలరావు, నైతం గజానంద్, నరహరి, మడవి లక్ష్మీకాంత ఉన్నారు.

సమర్థవంతమైన నాయకత్వంతోనే అభివృద్ధి

- 5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో ఓటు హక్కు గల ప్రతి ఒక్కరూ తమ ఓటును ఎలాంటి ఒత్తిడులకు, ప్రలోభాలకు లోను కాకుండా సక్రమంగా వినియోగించుకొని సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా దేశాన్ని అభివృద్ధి చేసుకోవచ్చుని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం ఐ ఓట్ ఫర్ ష్యూర్‌పై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన 5కేరన్‌ను స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణం నుంచి క్రీడాజ్యోతి వెలిగించి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి కలెక్టర్‌చౌక్, ఎన్టీఆర్ చౌక్ మీదుగా తిరిగి స్టేడియం చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు కలిగిన ప్రతి ఒక్కరూ బూత్ స్థాయి అధికారుల వద్దగాని, ఆన్‌లైన్‌లో ఫారం 6 ద్వారా తమ వివరాలను నమోదు చేసుకుని, ఓటు హక్కు పొందవచ్చన్నారు. గత ఎన్నికల్లో 83 శాతం ఓటింగ్ జగిగిందని, రానున్న ఎన్నికల్లో 100 శాతం నమోదుకు ఓటర్లకు విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడులకు లోను కాకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. సరైన నాయకత్వాన్ని ఎన్నుకొని దేశాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయాలలో ఓటు హక్కు ఎంతో విలువైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపుల కొరకు ప్రభుత్వం అవకాశం కల్పించడం జరిగిందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల వసతులు కల్పించడం జరిగిందని అన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కొరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని ట్రాన్స్ జెండర్లు తమ వివరాలను నమోదు చేసుకుని ఓటు హక్కు పొందాలని, ఎన్నికల సమయంలో వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చేతి వృత్తులకు చేయూత



నవతెలంగాణ-ముథోల్

తెలంగాణ రాష్ట్రంలోని చేతివృత్తులకు చేయూత నిచ్చేందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు ఆర్థిక చేయూత ప్రవేశపెట్టిందని ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని 34 మంది బీసీ లబ్ధిదారులకు ఆర్థిక చేయూత కింద చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు అఫ్రోజ్‌ఖాన్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఖలీద్ ముథోల్ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, నాయకులు రవీందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జిల్లాలో 31 షాపులకు లక్కీడ్రా పూర్తి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎక్సైజ్ పాలసీ 2023-25 సంవత్సరానికిగాను మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా సాగింది. లక్కీడ్రా నిర్వహించి టెండర్‌దారులను ఎంపిక చేశారు. మావల మండల పరిధిలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన సమక్షంలో లక్కీ డ్రా చేపట్టి దరఖాస్తుదారులను సెలక్ట్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 40 దుకాణాలకుగాను 31 షాపులకు మాత్రమే లక్కీడ్రా నిర్వహించారు. ఆదిలాబాద్, ఇచ్చోడ పరిధిలోని మరో 9 దుకాణాలకు 10లోపు దరఖాస్తులు రావడంతో వాటిని వాయిదా వేసినట్లు తెలిపారు. దరఖాస్తుదారులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పంక్షన్‌హాలు ప్రాంగణం సందడిగా మారింది. అటు దుకాణాలు దక్కించుకున్నవారు సంతోషం వ్యక్తం చేయుగా దక్కనివారు నిరాశతో వెనుదిరిగారు. మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 4 నుంచి 18 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. మొత్తంగా 40 షాపులకు గాను 975 దరఖాస్తులు అందగా వాటి ద్వారా సర్కార్‌కు రూ.19.50 కోట్ల ఆదాయం సమకూరింది. టెండర్‌దారులు ఒక్కో దుకాణానికి రెండు లక్షల చొప్పున నాన్‌రిఫండబుల్ చలానా, డీడీ రూపంలో చెల్లించారు. గతేడాది 592 దరఖాస్తులు రాగా ఈసారి అధికంగా 383 అప్లికేషన్లు వచ్చాయి. మొత్తానికి ప్రశాంతంగా ఈ టెండర్ల ఎంపిక ప్రక్రియ ముగిసింది.

లక్కీడ్రా ప్రక్రియ పారదర్శకం : కలెక్టర్

మద్యం షాపుల లక్కీడ్రా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. నూతన మద్యం పాలసీ నిబంధనలను అనుసరిస్తూ, దరఖాస్తుదారుల ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని 40 మద్యం షాపులకు మొత్తం 979 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ రోజు 31 మద్యం షాపులకు లాటరీ పద్ధతి ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందని, మిగిలిన 9 షాపులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే లక్కీడ్రా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆబ్కారీ శాఖ పర్యవేక్షకురాలు హిమశ్రీ, సీఐ శ్రీనివాస్, సిబ్బంది, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో...

జిల్లాలోని మద్యం షాపుల ఎంపికను సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. జిల్లాలో 47 మద్యం షాపులు ఉండగా 1019 దరఖాస్తులు వచ్చాయి. అయితే 47 షాపులకు గాను 43 షాపులను ఎంపిక చేశారు. మరో నాలుగు షాపులు దరఖాస్తులు రాకపోవడంతో వాటిని పెండింగ్‌లో పెట్టారు. జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి జి శ్రీనివాస్‌రెడ్డిలు ఈ లక్కీలో పాల్గొని, లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ లక్కీడ్రాలో ఎంపికైన వారు 22 ఆగస్టులోగా 1/6 వంతు లైసెన్స్ ఫీజులు, లేదా చాలన్ డ్రాఫ్టులు చెల్లించాలని తెలిపారు. లేనిపక్షంలో జరిమానాతో పాటు తిరిగి లక్కీడ్రా వేయడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో సీఐలు సంపత్ కృష్ణ, నజీర్ హుస్సేన్, రంగస్వామి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కేసు నమోదు చేయాలి

- మంత్రి తలసాని దిష్టిబొమ్మ దహనం చేసిన గిరిజనులు



నవతెలంగాణ-ముధోల్

గిరిజన ప్రజాప్రతినిధి భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ రాజేష్‌బాబుపై భౌతిక దాడికి పాల్పడిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అన్నారు. సోమవారం ముధోల్‌లోని నాయబాది చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ముధోల్ ఎస్సై సాయి కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముధోల్ నియోజకవర్గానికి చెందిన జాదవ్ రాజేష్‌బాబును కేటీఆర్‌ను కలిసేందుకు వెళుంటే తన ముందు నడుస్తున్నాడని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెనుకనుండి కాలర్‌పట్టి, మళ్లీ ముందుకు వచ్చి చెంప మీద కొట్టి అవమానించడం తగదన్నారు. ఉన్నత స్థాయి ఉద్యోగానికి రాజీనామా చేసి, ప్రజాక్షేత్రంలో, ప్రజా సేవ కొరకు వచ్చిన గిరిపుత్రున్ని కావాలనే అవమానించడం ఎంతవరకు సబబు అని అన్నారు.

తలసాని శ్రీనివాస్ యాదవ్ 24 గంటల్లో క్షమాపణ చెప్పకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విట్టోలి తండా, ఎడ్‌బిడ్ తండ, ముధోల్, విట్టోలి సర్పంచ్ విజేష్, ధూం నాయక్, వెంకటపూర్ రాజేందర్, సత్తయ్యగౌడ్, ముధోల్, లోకేశ్వరం మండలాల్లోని ఆయా తండాల్లోని గిరిజనులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం కాంగ్రెస్ నుంచి 4 దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కోసం సోమవారం నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవనంలో ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంజీవరెడ్డి ఆదిలాబాద్ అసెంబ్లీ సీట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ఇటివల బీజేపీ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కంది శ్రీనివాస్‌రెడ్డి సైతం ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్‌కు దరఖాస్తులను అందజేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-నార్నూర్



ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే అందించాలని ఏఐటీయూసీ నాయకులు సి.రవీందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి, అందులో పని చేస్తున్న కార్మికులు వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్ట్ చేపట్టినటువంటి శ్రీమహాలక్ష్మీ మ్యాన్ పవర్ సొసైటీ యజమాని ఇప్పటి వరకు నెలనెలా వేతనాలు ఇవ్వకుండా కార్మికులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. కార్మికులకు డీఎంఈ సర్క్యులర్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ ప్రకారం వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, సంబంధించిన కార్డ్స్ కార్మికులకు రోజువారీ సౌకర్యాలు కల్పించకుండా, కార్మికుల శ్రమ దోపిడి చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఆస్పత్రి సూపరింటెండెంట్ స్పందించి ఈ రెండు రోజుల్లో కార్మికుల అకౌంట్లలో నాలుగు నెలల వేతనాలు వేయించాలని డిమాండ్ చేశారు. వారి వెంట కార్మికులు రాథోడ్ సురేష్, పాపయ్య, నగేష్, ఉపేందర్, వనిత, ప్రేమ్‌దాస్, అజయ్, అనసూయభాయి, లక్ష్మీభాయి అన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నాం..

- పాండర్‌కొడ ఎమ్మెల్యే డా.సందీప్ దుర్వే

నవతెలంగాణ-బేల

పార్టీని బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో తెలంగాణతో పాటు ఆదిలాబాద్‌లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని పాండర్‌కొడ ఎమ్మెల్యే డా. సందీప్ దుర్వే అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. అంతకు ముందు కార్యకర్తలతో కలిసి బేల మండలంలోని కరొణి గ్రామంలో సర్పంచ్ పెందుర్ శారద కుటుంబాన్ని కలిశారు. ఈ సందర్భంగా అక్కడ ఆదివాసీ ప్రజలు కలిసి మహారాష్ట్ర ఎమ్మెల్యే సందీప్ దుర్వేతో పాటు పాయల్ శంకర్‌ను సన్మానించారు. అక్కడి నుంచి సదల్‌పూర్‌లోని భైరాందేవ్, మహదేవ్‌ను దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా పాండర్‌కొడ ఎమ్మెల్యే డా.సందీప్ దుర్వే మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అత్యధిక సంఖ్యలో ఎమ్మెల్యే స్థానాలు గెలిపే లక్ష్యంగా బీజేపీ సన్నాహాలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిట్యాల సుహాసినిరెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి, జైనథ్, బేల మండల అధ్యక్షులు దత్త నిక్కం, బేల ఎంపీటీసీ జ్యోతి, నాయకులు విజయ్, గణేష్ బోనగిరివార్, నగేష్ రెడ్డి, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం ట్రాఫిక్ నియమనిబంధనలు, సైబర్ క్రైమ్‌పై ఒకరోజు వర్క్ షాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ జే.అనిత ప్రిన్సిపల్ అధ్యక్షత వహించగా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ బి.ప్రణయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ట్రాఫిక్ నియమనిబంధనలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయకూడదని అన్నారు. అలాగే సైబర్ నేరాల గురించి, విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాత్‌రావు, కార్యక్రమ నిర్వాహకులు కే చంద్రకాంత్, టి.స్వప్న, రేఖ, ఇతర బోధన బోధనేతర సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాపకుల వృత్తి నైపుణ్యతపై ఆన్‌లైన్‌లో అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్‌లోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుల వృత్తి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, న్యూఢిల్లీ, బ్రెయినో విజన్ సొల్యూషన్స్ ఇండియా, హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. కాగా ఈనెల 21 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో జరిగే జాతీయస్థాయి అధ్యాపకుల వృత్తి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాన్ని కళాశాల కోఆర్డినేటర్, ప్రిన్సిపల్ పి.భరద్వాజ ఘనంగా ప్రారంభించారు. ఈ జాతీయస్థాయి ఆన్‌లైన్ కార్యక్రమంలో రికార్డు స్థాయిలో దేశవ్యాప్తంగా సుమారు 400 కళాశాలలు, 28000 అధ్యాపకులు పాల్గొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో విభాగాల అధిపతులు రాజ్ కుమార్, వీరస్వామి, రాజన్న, సుజయ్, అనిల్ కుమార్ చౌహాన్, అధ్యాపకులు విజయలక్ష్మి, ప్రవీణ్, రవికుమార్, నీల్ కమల్, సురేష్, యశశ్రీ, క్రాంతి కుమార్, జ్యోత్స్న రాణి, హేమలత, సంగీత, సుధాకర్, కుమారస్వామి, రామేశ్వర్‌రెడ్డి, సంజయ్‌సింగ్, కార్యాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. భూసంబంధ, పింఛన్, ఉపాధి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, గృహలక్ష్మి, తదితర సమస్యలపై దరఖాస్తులను అర్జీదారులు ప్రజావాణిలో అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని, సంబంధిత అధికారులు సమస్యలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, పరిష్కరించాలని సూచించారు. శాఖల వారిగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలనీ అధికారులు సూచించారు. ఈ ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడవ రోజు కాంగ్రెస్ పాదయాత్ర

నవతెలంగాణ-తాండూర్



కాసిపేట్ మండలం పెద్దనపల్లి గ్రామం నుంచి ప్రారంభం అయిన కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర సోమవారం ఏడవ రోజు సోమగుడం, భరత్‌కాలనీ, దుబ్బగూడం, పాత బెల్లంపల్లి, మన్నెంగూడ, ఆకెనపల్లి మీదుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాకం మల్లేష్, మాజీ ఎంపీటీసీ ధరణి సత్యనారాయణ, సోమగూడెం ఎంపీటీసీ మల్లమ్మ, మాజీ ఎంపీటీసీ వెంకట లక్ష్మి, రాష్ట్ర మహిళా కార్యదర్శి రొడ్డ శారద, బెల్లంపల్లి నియోజకవర్గ నాయకులు, నాతరి స్వామి, కాసిపేట్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి ప్రభాకర్, ఎండీ అఫ్జల్, గెల్లి జయరాం యాదవ్ పాదయాత్రలో పాల్గొన్నారు.

రక్తదాతలకు సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మెగాస్టార్ చిరంజీవి జన్మదినం పురస్కరించుకొని సోమవారం కాగజ్‌నగర్‌లోని జీవన్‌ధార బ్లడ్ సెంటర్‌లో చిరంజీవి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఈర్ల సునీల్‌కుమార్, కార్యదర్శి తవుటి తిరుపతి, అభిమానులు పాల్గొన్నారు.

పద్మశాలి శంఖారావం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలీల ఐక్యత చాటుతూ సెప్టెంబర్ మూడవ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే పద్మశాలి శంఖారావం విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలో శంఖారావంకు సంబంధించి వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో సెప్టెంబర్ మూడవ తేదీన పద్మశాలీల శంఖారావం నిర్వహించడం జరుగుతుందన్నారు. పద్మశాలీల ఐక్యత చూపేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ఐక్యంగా ఉన్నప్పుడే రాజకీయ సామాజిక ఆర్థిక ఎదుగుదల సాధ్యమవుతుందన్నారు. శంఖారావానికి ప్రతి ఇంటి నుండి ఒకరు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల రాజన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, రాష్ట్ర నాయకులు గుండా శంకర్, నల్ల కనకయ్య, నాయకులు లింగయ్య, శ్రీకాంత్, ధర్మయ్య, అనుమాండ్ల శ్రీకాంత్, శైలేందర్, ప్రణయ్, శ్యామ్, ప్రకాష్, శ్రీనివాస్, మోహన్, వేణుగోపాల్, తిరుపతి, మహేష్, ప్రకాష్, ప్రవీణ్, అశోక్, సునీల్, వెంకన్న పాల్గొన్నారు.

నూతన జీఎంగా మనోహర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-మందమర్రి



మందమర్రి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా మనోహర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉన్నత అధికారులు, ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. అధికారులు ఏరియాలోని గనులు, ఓసీపీల స్థితిగతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జీఎంకి వివరించారు. జీఎం మాట్లాడుతూ 2023 - 24 సంవత్సరానికి నిర్దేశించుకున్న ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాన్ని అందరమూ కలిసికట్టుగా పని చేస్తే లక్ష్యాన్ని సాధించడం కష్టమైన పనేమి కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు పైడిశ్వర్, కేకే ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, ఆర్కె ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, శాంతిఖని ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయ ప్రసాద్, ఐఈడీ డీజీఎం రాజన్న, డీజీఎం సివిల్ శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి పర్సనల్ మేనేజర్ మైత్రేయ బందు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

అటవీ పరిరక్షణ చట్టాన్ని రద్దు చేయాలి

- టీఏజీఎస జిల్లా అధ్యక్షుడు కోరెంగ మాల

నవతెలంగాణ-జైనూర్

నూతనంగా తీసుకొచ్చిన అటవీ పరిరక్షణ చట్టాలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోరెంగ మాల అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని మార్కెట్ ఆవరణలో ఆయన సంఘం సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం సాధించుకున్న చట్టాలను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మారుస్తుందన్నారు. నూతనంగా తీసుకొచ్చిన అటవీ పరిరక్షణ చట్టాల ద్వారా ఆదివాసుల పేసా చట్టం 1/70 చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు. ఆదివాసుల భూములపై కన్నేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సబ్‌సెంటర్ నిర్మించినప్పటికీ సబ్‌సెంటర్లలో వైద్యులను భర్తీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న సబ్‌సెంటర్లలో వైద్యులను భర్తీ చేసి నాణ్యమైన వైద్యమందించేందుకు ప్రభుత్వం బాధ్యతగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మడావి గణపతి, కార్యదర్శి కనక రమేష్, అంకూస్, హనుమంత్‌రావు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-మందమర్రి

బీసీ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా పూదారి చంద్రమోహన్ గౌడ్ ఎన్నికైన సందర్భంగా మందమర్రి పట్టణ బీసీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ అధ్యక్షులు కొండిల్ల శ్రీనివాస్, సకినాల శంకర్, సలాం, దానపల్లి తిరుపతి, మడ్డి వేణుగోపాల్, ప్రభాకర్, ఒద్దం సాగర్, సత్యనారాయణ, పోలు సంపత్ పాల్గొన్నారు.

వయోవృద్ధులను గౌరవించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వయోవద్ధులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జ్ లీగల్ సెల్ సెక్రెటరీ యువరాజ్ అన్నారు జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో వయోవృద్ధుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టంలో వయోవృద్ధుల రక్షణకు అనేక అంశాలు కేటాయించ బడ్డాయన్నారు. వయోవృద్ధుల కోసం నాల్సచే రూపొందించబడిన ఓల్డ్ ఏజ్ స్కీం 2016 గురించి వివరించారు. వృద్ధులు ఆత్మహత్య చేసుకోకుండా చూడాలన్నారు. వృద్ధాప్యం వరకు చూసుకున్న తన కుటుంబం అలాగే ఉండాలని కోరుకుంటారని ఉమ్మడి కుటుంబాల వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు, ప్రభుత్వ న్యాయవాది దీపక్ రావు, డీడబ్ల్యుఓ సావిత్రి, ఏవో ఖాదర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, రూ.5177 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులకు పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత మూడేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయటంలేదని అన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, గురుకులాలకు, హాస్టల్, కేజీబీవీ విద్యార్థులకు నోట్ పుస్తకాలు తక్షణమే అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. మన ఊరు మన-మనబడి పథకాన్ని అన్ని పాఠశాలకు వర్తింపజేయాలని, ఇంటర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలన్నారు. మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. మంచిర్యాల జిల్లాలోని పాత కలెక్టరేట్ భవనాన్ని ఎస్సీ బాలికల వసతి గృహానికి కేటాయించాలని, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల్లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు శిథిలావస్థలో ఉన్నందున నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, బెల్లంపల్లిలో పీజీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చెన్నూరులో ఎస్సీ గర్ల్స్ అండ్ బాయ్స్ కాలేజ్ హాస్టల్, ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్లో 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ మాళవిక, జిల్లా సహాయ కార్యదర్శి అనిల్, జిల్లా కమిటీ సభ్యులు ఈదూనూరి అభినవ్, దినేష్, నస్పూర్ మండల సహాయ కార్యదర్శి పల్లవేణి రాకేష్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడి భీమేష్ డిమాండ్ చేశారు. విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం డీఆర్ఓ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కె జాఫర్, వశాకే కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ప్రకాశ్, రామచందర్, ఆయుబ్ కాన్, జిల్లా డివిజన్ నాయకులు సాయి నాథ్, వినీష్, అశోక్ లు పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యాశాఖలోని పనిచేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఇన్‌ఛార్జి జిల్లా విద్యాధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాశాఖలో ఉపాధ్యాయులకు సమాజానికి మధ్య వారధిగా పనిచేస్తున్నామని తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో సీఆర్‌పీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్ లాంటి పోస్టులతో పాటు నాన్ టీచింగ్ సిబ్బంది విభాగాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 25728 మంది పని చేస్తున్నారని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు అమలులో ముఖ్య భూమిక పోషించామని తెలిపారు. వెంటనే తమ సర్వీస్ క్రమబద్ధీకరించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పవన్ కుమార్, గేడేకార్ సంతోష్ కుమార్, సందీప్, రమణ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ నూతన కార్యవర్గం ఎన్నిక

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా మోహన్, అధ్యక్షులుగా విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా తుకారాంలు ఎన్నికయారు.

అభయ యాప్‌పై అవగాహన

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి మంజునాథ ఫంక్షన్ హాల్‌లో మందమర్రి ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆటో డ్రైవర్లకు రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్, అభయ యాప్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా హాజరైన మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల రక్షణ, ఆధునిక సాంకేతికను ఉపయోగిస్తూ మీ భద్రత-మీ లక్ష్యం అనే నినాదంతో అభయ మొబైల్ అప్లికేషన్ ఏర్పాటు చేసారన్నారు. మహిళలు ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించేందుకు ఈ యాప్‌ను ఆవిష్కరించారని, ఆపద సమయంలో ఈ యాప్ ను సద్వినియోగం చేసుకుని జరిగే ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. యాప్ కొరకు పట్టణంలోని ఆటోలన్నీ క్యూ ఆర్ కోడ్‌తో కూడిన యూనిక్ నెంబర్‌ను తీసుకోవాలన్నారు. డ్రైవర్లు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని, వాహనాల ధ్రువ పత్రాలు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలకు కారణం కావద్దని,



ప్రమాదాల నివారణకు సహకరిస్తూ ప్రమాదరహిత పట్టణంగా తీర్చిదిద్దాలని, ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలపకుండా ఆటో స్టాండ్‌లో మాత్రమే నిలపాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

శాశ్వత లైబ్రరీ ఏర్పాటు చేయాలని వినతి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో శాశ్వత లైబ్రరీని ఏర్పాటు చేసి నిరుద్యోగులు సోమవారం అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో శాశ్వత లైబ్రరీ ఏర్పాటు కోసం గత కొన్ని నెలలుగా అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నామని, ఎవరు సరిగా స్పందించడం లేదని తెలిపారు. గతంలో శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియంలో సింగరేణి ఆధ్వర్యంలో సిఈఆర్ క్లబ్‌లో గ్రంథాలయ ఏర్పాటుకు సహకరించారని, ప్రస్తుతం నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. గతంలో సింగరేణి డైరెక్టర్ పా బలరాం, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్‌కు వినతి పత్రాలు అందజేసిన కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులకు ఎన్నికల సమయంలో తప్ప మిగతా సమయంలో నిరుద్యోగులు కాన రావటం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్రీరాంపూర్ ఏరియాలో శాశ్వత గ్రంథాలయ ఏర్పాటు చేయాలనివారు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీపెల్లి రాజు, కట్ల శ్రీనివాస్, దుర్గం రఘు, సాగర్ క్రాంతి, శ్రావణ్ పాల్గొన్నారు.

దాడి చేసి నగదు దోపిడీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఫైనాన్స్ కంపెనీలో విధి విర్వహనకై వచ్చిన ఉద్యోగిపై మార్గమధ్యంలో దాడి చేసి నగదు దోచుకెళ్ళిన ఘటన సోమవారం ఈజ్‌గాం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈజ్ గాం ఏఎస్సై హీరామన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖర్జి భీంపూర్ గ్రామానికి చెందిన ప్రమోద్ సింగ్, శ్రీరాం చిట్ ఫండ్‌లో పనిచేస్తున్నాడు. విధి నిర్వహనలో భాగంగా విలేజ్ నెంబర్-2కు వసూళ్లకోసం వచ్చాడు. వసూలు కాకపోవడంతో తిరుగుపయనమయ్యాడు. ఈజ్‌గాం శివాలయం దాటిన తర్వాత ఒర్రెవద్ద బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ ముగ్గురు వ్యక్తులు మాస్కులతో వచ్చి దాడి చేసి ప్రమోద్ సింగ్ వద్ద ఉన్న రూ.33 వేల నగదు దోచుకెళ్లారు. తన వద్ద వ్యక్తిగత నగదుతో పాటూ ఇది వరకు వసూలు చేసిన నగదు ఉందని, సదరు నగదును గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఈజ్ గాం ఏఎస్సై తెలిపారు.



పార్టీ నిర్ణయానికి అత్రం సక్కు సానుకూలం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుండి గెలుపొంది అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు రెండోసారి అవకాశం ఇస్తామని అధిష్టానం చెప్పినప్పటికీ అనుకోని పరిణామాల నేపథ్యంలో కోవలక్ష్మికి టికెట్ కేటాయించారు. అయితే అధిష్టానం ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు ఆదిలాబాద్ ఎంపీగా అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆయన వెనక్కి తగ్గినట్లు తెలిపారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పని చేస్తానని అన్నారు. అధికార పార్టీలో రెండు వర్గాలు ఉన్నప్పటికీ ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతిస్తానని తెలపడంతో అధికార పార్టీకి అసంతృప్తి నాయకుల బెడద లేకుండా పోయింది. అధికార పార్టీకి అన్ని చోట్ల బలం ఉండడంతో కోవలక్ష్మీ గెలుపుకు మార్గం సుగమమైనట్లయ్యింది.

జిల్లాలో మొదలైన ఎన్నికల వేడి

అధికార పార్టీ అధినేత కేసీఆర్ నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల ప్రకటన నిర్ణయంతో ఒక్కసారిగా జిల్లాలో ఎన్నికల వేడి రాజుకుంది. కాంగ్రెస్, బీజేపీతో పాటు ఇతర పార్టీలు కూడా తమ అభ్యర్థుల ప్రకటన కోసం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా రేపటినుండి జిల్లాలో ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్న అధికార పార్టీని అడ్డుకోవడం ప్రతిపక్షాలకు కొంత ఇబ్బందిగా మారే పరిస్థితిని కేసీఆర్ సృష్టించగలగాడనడంలో ఎలాంటి సందేహం లేదు దీనిని అధికార పార్టీ నాయకులు ఏ విధంగా వినియోగించుకుంటారు. ప్రతి పక్ష నాయకులు ఏ విధంగా ఎదుర్కొంటారనేదానికి కాలమే సమాధానం చెబుతుంది.

మద్యం టెండర్లు రద్దు చేయాలి



నవతెలంగాణ-హాజీపూర్

మద్యం టెండర్లను రద్దు చేయాలని పీవైఎల్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర నాయకులు కే.మనోహర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్యం టెండర్లు నిర్వహించడం వలన విద్యార్థులకు యువతకు మద్యానికి బానిసై అనేక నేరాలకు పాల్పడుదటమే కాక ఇబ్బందులకు గురవుతా ఉన్నారన్నారు. ప్రభుత్వం ఈ మద్యం షాపుల్ని పెంచి పోషించడం వల్ల కుటుంబాలలో చిచ్చు పెడుతున్నారని అన్నారు. ఎంతోమంది యువత పెడదారిన పడుతూ అనేక నేరాలు, హత్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ మద్యం టెండర్లను రద్దు చేసి విద్యాలయాలను ఏర్పాటు చేయాని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు ఆర్.మహేందర్, మక్బూల్, సంతోష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే బీజేపీని గెలిపించండి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సిర్పూర్ నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలని మహారాష్ట్ర ఎమ్మెల్యే బంటి భాంగ్డియా అన్నారు. ప్రవాస్ యోజనలో భాగంగా సోమవారం విలేజ్ నెంబర్-2లో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు. మెరుగైన రహదారులు, మెరుగైన మౌలిక వసతులు, సాగునీటి వసతుల కోసం బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా ఒక్క ఎకరానికి కూడా నీరివ్వని ఘనత స్థానిక ఎమ్మెల్యేకే దక్కిందని దుయ్యబట్టారు. బీజేపీ ఆధ్వర్యలో సిర్పుర్ నియోజక వర్గంలోని ప్రతి ఎకరానికి సాగు నీరు అందించి సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోనీ శ్రీశైలం, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాళీదాస్ మజుందార్, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రణ్వీర్ బిశ్వాస్, ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గోళం వెంకటేశం, ఎంపీటీసీ బికాస్ ఘరామి, పిర్మింగుల తిరుపతి, మాజీ కౌన్సిలర్ ఈర్ల విశ్వేశ్వర్ రావు, సోషల్ మీడియా కన్వీనర్ అమిత్ బిశ్వాస్, అరుణ్‌లోయ, ముత్తు అశోక్, సమీర్ గుప్త, విజయ్ ఘరామి, మండడే సుధాకర్, కొండ తిరుపతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ ఆసిఫాబాద్

బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రస్తుత జిల్లా పరిషత్ చైర్పర్సన్ కోవలక్ష్మికి టికెట్ కేటాయిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో నియోజకవర్గ నాయకులు ఆమెను హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గెలుపు కోసం కృషి చేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, సింగిల్ విండో చైర్మన్ ఆలీ బిన్ అహ్మద్, నాయకులు అమర్ బిన్ అహ్మద్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో సంబరాలు

కోవలక్ష్మికి టికెట్ కేటాయించిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ సర్పంచులు భీమేష్, శ్రీనివాస్, కిష్టయ్య, బాబురావు, బడిరాం, వైస్ ఎంపీపీ సుంకరమంగా పెంటయ్య పాల్గొన్నారు

సివిల్ సర్వీస్ క్రీడా పోటీల్లో జిల్లాకు పతకాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ సివిల్ సర్వీస్ క్రీడా పోటీల్లో ఆసిఫాబాద్ జిల్లా ఉద్యోగులు పసిడి పతకాలు సాధించి సత్తా చాటారు. జిల్లా క్రీడల అధికారిని రమాదేవి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన సివిల్ క్రీడా పోటీల్లో పంగిడిమాదర పీఈటీ గుండం లక్ష్మణ్ జావిలిన్ త్రో క్రీడ పోటీల్లో, బెజ్జూరు పీఈటీగా విధులు నిర్వహిస్తున్న పెందూరు మంగావతి డిస్కస్ త్రో విభాగంలో బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అనార్పల్లిలో పీడీగా పనిచేస్తున్న ఆత్రం కృష్ణమూర్తి డిస్కస్ త్రో విభాగంలో వెండి పతకం సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా పథకాలు సాధించిన వారిని అభినందించారు. మరిన్ని పథకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, ఏసీఎంఓ ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, ఎస్జిఎఫ్ కార్యదర్శి సాంబశివరావు, పెట అధ్యక్షులు నరేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి ఈ-కేవైసీ తప్పనిసరి

నవతెలంగాణ-బెజ్జూర్

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీని రూ.రెండు లక్షల నుండి రూ.ఐదు లక్షల వరకు పెంచడం జరిగిందని, ఆరోగ్య శ్రీ కార్డు తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఆరోగ్యశ్రీ ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని సీఎస్‌సీ జిల్లా మేనేజర్ రోహిత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ఈకేవైసీ చేసుకోని వారికి ఆరోగ్యశ్రీ పథకం వర్తించదని, దీనిని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సీఎస్‌సీ సెంటర్‌లో ఈకేవైసీ చేయడం జరుగుతుందని, ఆధార్‌కార్డు, తెల్ల రేషన్‌కార్డు తీసుకొని వెళ్తే ఈకేవైసీ చేస్తారన్నారు. ఈకేవైసీ చేసుకున్న వారికి నెల రోజుల్లో కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఒంటి కాలుపై మిషన్ భగీరథ కార్మికుల నిరసన

నవతెలంగాణ-కెరమెరి



మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు చెల్లించాలని సోమవారం ఇస్లాగూడ వాటర్ పంప్ వద్ద ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కార్మికుల మండల అధ్యక్షుడు మాచర్ల బుడ్డయ్య మాట్లాడుతూ మిషన్ భగీర కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మిషన్ భగీరథ యాజమాన్యాల స్పందించి సత్వరమే వేతనాలు చెల్లించి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చరణ్, రాజు ప్రేమ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటనతో బీఆర్ఎస్ సంబురాలు





నవతెలంగాణ-తాంసి

బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ నేరడిగొండ జెడ్పీటీసీ అనీల్ జాదవ్‌కు సీఎం కేసీఆర్ సోమవారం తొలి జాబితాలో ప్రకటించడంతో అనిల్ జాదవ్ అభిమానులు తాంసి, భీంపూర్ మండల కేంద్రాలతో పాటు అయ గ్రామాల్లో టపాసులు పేల్చి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ కంది గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కృష్ణ, రజినీ, అఫ్రోజ్, కాంత్‌రెడ్డి, గంగారాం, మహేందర్, పరమేశ్వర్, కళ్యాణ్ ఉన్నారు.

కడెం : ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా భూక్య జాన్సన్ నాయక్ పేరు ఖరారు కావడంతో ఆయన గ్రూపు బీఆర్ఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. తెలుగుతల్లి విగ్రహం వద్ద బాణాసంచా కాల్చి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు.

రెబ్బెన : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోవ లక్ష్మి ఖరారు కావడంతో మండలంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలో బాణాసంచా పేల్చి, స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, కుందారపు శంకరమ్మ, పందిర్ల మధునయ్య, వినోద్ జైస్వాల్, నవీన్‌కుమార్ జైస్వాల్, బొమ్మినేని శ్రీధర్, మాణిక్యరావు పాల్గొన్నారు.

కుభీర్ : బీఆర్ఎస్ మొదటి లిస్టులో ఎమ్మెల్యే అభ్యర్థిగా విఠల్‌రెడ్డి పేరు మూడోసారి ఖరారు కావడంతో మండల బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహం వద్ద టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కందుర్ సంతోష్, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల పీరాజి, నగలింగం, సూది రాజన్న, మాజీ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డి రాములు పాల్గొన్నారు.

వాంకిడి : ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోవలక్ష్మిని ప్రకటించడంతో మండల కేంద్రంలో సోమవారం ఆమె అనుచరులు సబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ అందరు ఏకతాటిపై ఉండి కోవలక్ష్మి విజయానికి కృషి చేయాల్సిన బాధ్యత మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సింగిల్‌విండో చైర్మన్‌లు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బండె తుకారాం, దుర్గం కమలాకర్, అయూబ్, సింగిల్‌విండో చైర్మన్ పెంటు, వాంకిడి ఉప సర్పంచ్ పవన్‌సాయి, నాయకులు అశోక్, భీంరావు పాల్గొన్నారు.

జైనూర్ : బీఆర్ఎస్‌లో వరుసగా మూడోసారి కోవలక్ష్మికి ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ రావడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, సిర్పూర్(యు) ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలకేంద్రాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థుల తొలి జాబితాలో ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న కోవలక్ష్మికి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో టపాకాయలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, సర్పంచ్‌లు ఆత్రం వీనాబాయి, మడావి భీంరావు, నాగోరావు, కనక రాంషావ్, జైనూర్ ఎంపీపీ బీబీనూర్ నాయకులు అజ్జులాల, బీఆర్ఎస్ నాయకులు శెఫిక్ అన్సారీ, జాదవ్ దయాకర్, లక్ష్మణ్, ప్రజలు పాల్గొన్నారు.



జన్నారం : ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా బుక్య జాన్సన్ నాయక్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో జాన్సన్ నాయక్ మద్దతు దారులు మండల కేంద్రంలో స్వీట్లు పంచుకొని టపాకాయలు పేల్చారు. అనంతరం డీజేతో అంబేద్కర్ విగ్రహం నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, పార్టీ కార్యకర్తలు ఫజల్ ఖాన్ సురేష్, కాంద్రపు మల్లేష్, శ్రీధర్ల రమేష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిలాబాద్ నుంచి జోగు రామన్నను ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట టపాసులు పేలుస్తూ, మిఠాయిలు తినిపించుకుంటూ వేడుకలు నిర్వహించారు. జోగు రామన్నను కార్యకర్తలు భుజాలపై ఎత్తుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్ మాట్లాడుతూ అనునిత్యం ప్రజల ఇక్కట్లను పరిష్కరించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే జోగు రామన్న విశేష కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభ్యున్నతి పథంలో నడుపుతున్నారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా వరుసగా ఐదవ సారి ఆయన ఘన విజయం సాధించనున్నారని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, పార్టీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలాల్ అజయ్, అశ్రాఫ్, నాయకులు సాజిదోద్దీన్, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : సీఎం కేసీఆర్ సోమవారం ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా విడుదల చేయగా, ఖానాపూర్ నియోజకవర్గం అభ్యర్థిగా భూక్యా జాన్సన్ నాయక్ పేరు ఖరారు చేయడంతో మండల కేంద్రంతో పాటు ఏమాయికుంట, మూత్నూర్ తదితర గ్రామాల్లో అభిమానులు టపాసులను పేల్చి సంబురాలను నిర్వహించుకున్నారు. గులాబీ జెండాను చేత పట్టుకొని కుమురం భీమ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, సంబురాలు నిర్వహించుకున్నారు.

ఖానాపూర్ : బీఆర్ఎస్ ఖానాపూర్ అభ్యర్థిగా భూక్యా జాన్సన్ నాయక్ పేరు ఖరారు కావడంతో సోమవారం ఖానాపూర్‌లో కార్యకర్తలు, పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఖానాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం టపాసులు పేల్చి సీట్లు పంచుకున్నారు.

ముథోల్ : ముథోల్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ విఠల్‌రెడ్డికి ప్రకటించడంతో నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో సోమవారం బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, సంబరాలు నిర్వహించుకున్నారు. స్థానిక బస్టాండ్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగ టపాకాయలు కాల్చారు. ఒకరినొకరు సీట్లు పంచుకున్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు అఫ్రోజ్ ఖాన్, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, నాయకులు పోతన్న యాదవ్, సంజీవ్, రవిందర్‌రెడ్డి, బాబన్న, మురళి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలమడుగు : బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అనిల్ జాదవ్‌కు టికెట్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించడంతో సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు టపాసులు పేల్చి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో పిడుగు సంజీవ్‌రెడ్డి, తలమడుగు సర్పంచ్ కళ్లెం కారుణాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మహిళ నాయకురాలు కాటిపెల్లి సునితరెడ్డి, వార్డు సభ్యులు గంగన్న, ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు ముడుపు కేదరీశ్వర్‌రెడ్డి, కృష్ణ, రామాకాంత్, అజయ్‌రెడ్డి, దేవన్న, నర్సింలు, కొత్తురు ధర్మారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంతో పాటు సొనాల, పొచ్చెర, దన్నూర్(బి), చింతలబోరి, మర్లపల్లి, బాబేర, కంఠేగావ్, గ్రామంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి సంబురాలు నిర్వహించారు. అలాగే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బోథ్ నియోజకవర్గం అభ్యర్థి అనిల్ జాదవ్‌ను ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆయా గ్రామాలలో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.







జానపద దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జైనూర్

మండలంలోని మార్లావాయి గ్రామంలో మంగళవారం నిర్వహించనున్న ప్రపంచ జానపద దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సంస్కృతి శాఖ సౌజన్యంతో చారిత్రాత్మక గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆదివాసులు కళా ప్రదర్శన కోసం ముందుకు రావాలని కోరారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు గుస్సాడీ శిక్షణ కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

మిషన్ భగీరథ హెల్పర్ల శిక్షణ శిబిరం



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన మిషన్ భగీరథ హెల్పర్ల శిక్షణా శిబిరాన్ని డీఈ సయ్యద్ హజార్ సోమవారం ఎల్లంపల్లి రిజర్వాయర్ డబ్ల్యూపీటీ వద్ద నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ శిబిరానికి రెవెన్యూ శాఖ నుండి మిషన్ భగీరథకు కేటాయించిన మిషన్ భగీరథ హెల్పర్లు పాల్గొన్నారు. మిషన్ భగీరథ నీటిని ప్రతి ఇంటికి సరఫరా చేసే విధంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు విధి నిర్వహణలో పాటించవలసిన బాధ్యతలను డీఈ తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాలకు, మండలానికి ఆరుగురు చొప్పున హెల్పర్లను కేటాయించినట్లు తెలిపారు. రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో హెల్పర్లు చేయవలసిన పనుల గురించి ప్రత్యక్ష, ప్రదర్శన పద్ధతుల్లో శిక్షణ ఇవ్వనున్న డీఈ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఏఈలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రోజున ప్రపంచ వయో వృద్దుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ భీమ్లాల నాయక్ వృదులను శాలువాలతో సత్కరించి, మిఠాయిలు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృదుల ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. సహాయకులు శ్యంరావు, చంద్రమౌళి రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

గర్భిణీకి రక్తదానం

నవతెలంగాణ - జైనూర్



మండలంలోని ఆశొపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల సోంబిగూడ గ్రామానికి చెందిన గిరిజన గర్భిణీ సోయం బిగిలాబాయికి సోమవారం ఫార్మాసిస్టు శ్రీధర్ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడారు. సోయం బిగిలాబాయికి 4.9శాతం మాత్రమే రక్తం ఉండడంతో ఆమెకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో ఆస్పత్రిలోనే పనిచేసే శ్రీధర్ రక్తదానం చేసి మానవత్వం చూపించాడు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ జడ్పీటీసీ

నవతెలంగాణ-జన్నారం



జన్నారం మాజీ జడ్పీటీసీ బీఆర్ఎస్ నాయకుడు లావుడ్య భక్షి నాయక్ సోమవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్ లోని గాంధీ భవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి భక్షినాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్‌ను బలోపేతం చేసి అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట నిర్మల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీహరిరావు, ఆదిలాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జు పటేల్ ఉన్నారు.

నృత్యాలపై అవగాహన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణం త్రిశూల్‌పహాడ్‌పై సోమవారం జిల్లా డ్యాన్స్ స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో యువతీ యువకులకు నృత్యాలపై అవగాహన కల్పించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కోనప్ప సతీమణి రమాదేవి, రాష్ట్ర ఒలంపిక్ డ్యాన్స్ అసోషియేషన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, నాయకులు కాచం శ్రీనివాస్, ఎస్సై చంద్రశేఖర్, కౌన్సిలర్ డొంగ్రి సునీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నృత్యాల వల్ల కలిగే ఉపయోగాలను స్క్రీన్ ద్వారా వివరించారు. అనంతరం కళాకారులకు సర్టిఫికెట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ జిల్లా అధ్యక్షురాలు అమరావతి, ప్రధాన కార్యదర్శి డొంగ్రి సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గిరిజన మహిళపై దాడి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ వద్ద గిరిజన మహిళపై దాడి చేసి హింసించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని లంబాడా జేఏసీ, సిఎస్‌సిఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకట్రావు నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండలం కేంద్రంలో తెలంగాణ తల్లి చౌరస్తాలో నిరసన తెలిపారు. కూతురి వివాహం కోసం బంధువుల నుండి డబ్బులు తీసుకొని వెళ్తుండగా దొంగ నెపంతో రాత్రంతా స్టేషన్లో ఉంచి విపరీతంగా కొట్టారని చెప్పారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా వ్యవహరించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు భూక్య కిషన్ నాయక్, జరుపుల రాజేశ్వర్ నాయక్, రాము నాయక్, నెహ్రూ నాయక్, రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్‌బాబుపై దాడి చేసిన రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ యాదవ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని లంబాడి జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రామారావు, ఉపాధ్యక్షులు రాథోడ్ శేషారావు, సలహాదారు జాదవ్ గోపాలరావు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాజేష్ బాబు గల్లా పట్టుకొని వెనక్కి లాగిన మంత్రి శ్రీనివాస్ యాదవ్‌పై టిఆర్ఎస్ అధిష్టానం వెంటనే చర్యలు తీసుకొని ఆయనను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలన్నారు. మంత్రికి ముందు నడిచినందుకు నెట్టివేసి కాలర్ పట్టుకుని చెంప దెబ్బ కొట్టడం హేయమైన చర్య అన్నారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవర్ దేవిదాస్, నేతావత్ రాందాస్, జాదవ్ చంద్రకాంత్, రాథోడ్ ధన్‌లాల్, రాథోడ్ విఠల్ ఉన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ - రెబ్బెన

మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ తెలిపారు. సోమవారం జరగాల్సిన సమావేశం కోరం లేక వాయిదా వేసినట్టు తెలిపారు. త్వరలోనే సర్వసభ్య సమావేశం నిర్వహించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ - సిర్పూర్(టి)

రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన గొప్ప ఆయుధం ఓటు అని, దీన్ని ప్రతి ఒక్కరు గుర్తించి ఓటు హక్కును ఉపయోగించుకొని తమకు కావాల్సిన ప్రభుత్వాన్ని ఎన్నుకొనే అధికారం ప్రజలకు ఉందని ఇన్‌చార్జి తహసీల్దార్ లలిత అన్నారు. సోమవారం మండలంలోని పారిగాం గ్రామంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ సిటిజన్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సీనియర్ సిటిజన్లను గుర్తించి సన్మానించి ఎన్నికలు, ఓటు హక్కు గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు జుగాజీరావు, మోబిన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దహెగాం : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు వారోత్సవాల్లో భాగంగా సోమవారం సీనియర్ సిటిజన్లను డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు నాందేవ్, శృతితో పాటు రెవెన్యూ సిబ్బంది విజయ్‌కుమార్, షారుఖ్, తాజ్‌బాబా, మహెబూబ్ పాల్గొన్నారు.

నార్నూర్ : ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారంతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్‌లకు తహసీల్దార్ రాజలింగం కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. వయోవృద్ధులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సన్మాన కార్యక్రమంలో డీటీ అమృత్‌లాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్ర 16వ మహాసభలకు తరలిరావాలి



నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) తెలంగాణ రాష్ట్ర 16వ మహాసభలకు తరలిరావాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సోమారం తిరుపతి, ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ తెలిపారు. గోదావరిఖనిలో జరిగే 16వ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వాలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలకు జాతీయ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి హాజరవుతున్నారని తెలిపారు. కార్మిక నాయకులు, కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఖైరిగూడ ఇన్‌చార్జి రెహమాన్, బ్రాంచ్ కోశాధికారి శేషు, అర్గనైజింగ్ కార్యదర్శులు కె కిరణ్, చంద్రశేఖర్, ఫిట్ ఇన్‌చార్జి ఎండీ షెకిల్, కాంట్రాక్టు కార్మికుల ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయిల్ల నర్సయ్య, సహాయ కార్యదర్శి సాగర్‌గౌడ్, నాయకులు బద్రు, మహేందర్, శంకర్, కృష్ణ, తిరుపతి పాల్గొన్నారు

ఘనంగా నాగుల పంచమి వేడుకలు

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంతో సహాపలు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను మహిళలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పవిత్ర స్నానాలు ఆచరించి మహిళలు సమీపాన ఉన్న పుట్టలోనికి పాలు, పెరుగు, గుడ్లు వేసి నాగన్నకు మొక్కుకున్నారు. అనంతరం పాయసాలు వండి, పుట్టల దగ్గర నైవేద్యాలు సమర్పించారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం నాగులపంచమిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుండే మహిళలు పాము పుట్టలలో పాలు పోశారు. అందరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయా పుట్టల వద్ద మహిళలు తమ మొక్కులు తీర్చుకున్నారు.

కుభీర్ : మండల కేంద్రంలోని పార్డి(బి), పల్సి, సొనారి గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం నాగుల పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామంలో ఉన్న నాగ దేవత విగ్రహాలకు మహిళలు ఉదయం నుంచి పుట్టకు పాలు పోయడానికి భక్తులు నాగదేవత మందిరలో క్యూకట్టి ప్రత్యేక పూజలు చేసి పుట్టలో పాలు పోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ఇంటికి వచ్చి అన్నదమ్ములు కండ్లు కడిగి కట్న కానుకలు అందజేశారు.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు గిరిజన గ్రామాల్లో సోమవారం నాగుల పంచమి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉదయాన్నే పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. శివుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పండుగ సందర్భంగా కేస్లాపూర్ నాగోబా ఆలయానికి భక్తులు తరలివెళ్లారు. పలు చోట్ల గ్రామాల్లో గిరిజన సంస్కృతి సాంప్రదాయం ప్రకారం మహిళలు, యువతీ, యువకులు ఉయ్యాల ఊగుతూ పాటలు పాడారు.